వాల్టా చట్టానికి తూట్లు

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- అనధికారికంగా బోర్ల తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



దశరథపురం సమీపంలో చెట్లను నరికివేసిన దృశ్యం



బూరగాంలో అనధికారికంగా తవ్వుతున్న బోరు

పాతపట్నం: ప్రభుత్వం తీసుకునే ఏ చట్టమైనా అధికారులు అమలు చేసే తీరుపైనే దాని ప్రయోజనం కనిపిస్తోంది. దీనికి ఉదాహరణ వాల్టా చట్టమే. వాతావరణ సమతుల్యం, పర్యావరణానికి విఘాతం కలగకుండా సహజ సిద్ధవనరులైన నీరు, భూమి, చెట్లపై నియంత్రణకు 12 ఏళ్ల కిందట వాల్టా చట్టాన్ని తీసుకువచ్చారు. అటవీ, రెవెన్యూ శాఖల సిబ్బంది ఉదాసీనత కారణంగా ఈ చట్టం సరిగా అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నా, అనధికారికంగా బోర్లు వేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అసలు ఆ బాధ్యత తమది కాదన్నట్లు వ్యవరిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది అక్రమార్కులతో లాలూచీ పడి దొడ్డిదారిన అనుమతి పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువల పక్కన ఉన్న చెట్లను అక్రమార్కులు నరికి వేస్తున్నా పట్టించుకోవడం లేదు.

అనుమతి లేకుండా..

పాతపట్నం మండలంలోని రంకిణి, సవర సిద్ధమనుగు, బూరగాం, కొరసవాడ, దశరథపురం, తెంబూరు, పెద్దమల్లిపురం, గంగువాడ, పెద్దసున్నాపురం, బైదలాపురం చంగుడి, సరాలి తదితర గ్రామాల్లో ఇటీవలి చెట్లు నరికివేశారు. కలపను అనకాపల్లి, రాజమండ్రి, ఒడిశా, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

బోర్లు తవ్వకాలు..

బూరగాం, సరాలి, చంగుడి, కొసవాడ, కాగువాడ, గంగువాడ, తెంబూరు గ్రామాలతోపాటు పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో ఇటీవలి అక్రమంగా బోరు తవ్వకాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

పక్కదారిపడుతున్న చట్టం

వాల్టా చట్టం పూర్తిగా పక్కదారిపడుతోంది. విచ్చలవిడిగా చెట్లు నరికివేస్తున్నారు. వీఆర్వోలతో కలిసి అక్రమార్కులు తమ స్వార్థప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని అతిక్రమిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లోని చెట్లను సైతం నరికివేసి మిల్లులకు యథేచ్ఛగా కలపను తరలిస్తున్నారు. అనధికారికంగా బోర్లను వేస్తూ నీటి దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

చట్టం అమలు ఇలా..

- మండల స్థాయిలో వాల్టా చట్టం అమలు బాధ్యత రెవెన్యూ శాఖదే. తహసీల్దార్ మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.
- చట్టం అమలుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి.
- వ్యవసాయ, గృహ అవసరాలకు బోర్లు తవ్వేటప్పుడు, చెట్లు నరికేటప్పుడు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.
- వాల్టా చట్టం అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి.
- అన్ని శాఖల అధికారులతో చట్టం అమలుపై సమావేశాలు నిర్వహించాలి.
- కమిటీలను పటిష్టపరిచి సక్రమంగా అమలు అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలి.

చర్యలు తీసుకుంటున్నాం



వాల్టా చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో కచ్చితంగా అమలు చేసేలా వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడి అనధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

– ఎస్.కిరణ్‌కుమార్, తహసీల్దార్, పాతపట్నం

క్లస్టర్ విధానాన్ని విరమించుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోల సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: గ్రామ, వార్డు సచివాలయాలను కుదించి క్లస్టర్ విధానాన్ని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, దీన్ని విరమించుకోవాలని వీఆర్వోలు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ సత్యనారాయణకు మండల వీఆర్వోల సంఘం ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందజేశారు. క్లస్టర్ విధానం వస్తే వీఆర్వోలకు మరిన్ని ఇబ్బందులు వస్తాయని, పని ఒత్తిడి పెరుగుతుందని వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల అప్పలనాయుడు అన్నారు. ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. వీఆర్వోల విధి, విధానాలు, ఉద్యోగోన్నతలు, గ్రేడ్‌ల విభజన, తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ విధానంపై ఆందోళన ఉధృతం చేస్తామని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన పరిసరాలను, గ్రామాలను అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లోనూ శనివారం నిర్వహించారు. వీధులు, రోడ్లను శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని అవగాహన ర్యాలీలు, మానహారాలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధి వేతనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: ఆల్ ఆంధ్ర రోడ్డులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు



సారవకోట: నౌతళ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మానవహారం నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో నార సంచులను అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, కమిషనర్ బాలజీప్రసాద్



బూర్జ: బూర్జలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి రమణ, ప్రజాప్రతినిధులు, అధికారులు



జలుమూరు: లింగాలవలస ఉన్నత పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న ఎంఈఓ మాధవరావు, ఉపాధ్యాయులు



కొత్తూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ నీరజ, సిబ్బంది



పొందూరు: పొందూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు



సరుబుజ్జిలి: రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేస్తున్న వేతనదారులు



ఆమదాలవలస రూరల్: కొర్లకోటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి వేతనదారులు, గ్రామస్తులు



నరసన్నపేట: ఉర్లాం పీహెచ్‌సీ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

క్లుప్తంగా

మే 7 నుంచి బ్రహ్మోత్సవాలు



బ్యానర్‌ను విడుదల చేస్తున్న ట్రస్టీ సభ్యులు, ఆహ్వాన కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ చైర్మన్ పొట్నూరు వీరభద్రస్వామి తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం బ్యానర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ 12న గరుడ, 16న స్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటాయన్నారు. ఆలయ అర్చకులు సాయి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వార్షిక బ్రహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ట్రస్టీ ప్రతినిధి పి.కృష్ణప్రసాద్ బ్రహ్మోత్సవాల ఆహ్వాన కమిటీ సభ్యులు మావుడూరు జగదీష్ బాబు, జోష్యుల జగన్నాథశర్మ, టంకాల అర్జున్, టంకాల గౌతం, తదితరులు పాల్గొన్నారు.

80 టేబుళ్ల వితరణ



పాఠశాలలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు మాజీ ఎంపీపీ మాడుగుల రామారావు, పలువురు దాతలు 80 టేబుళ్లను శనివారం అందించారు. ఈ పాఠశాలలో టేబుళ్లు లేకపోవడంతో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మార్పు చేయాలనే ఆలోచనను అధికారులు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీతోపాటు పలువురు దాతలు స్పందించి టేబుళ్లను సమకూర్చారు. దాతలను విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్ఎం గణపతిరావు అభినందించారు. మండల ప్రత్యేకాధికారి మధుబాబు, ఎంపీడీఓ ఎన్.పి.పండా, ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభం, కార్యదర్శి అప్పారావు, స్కూల్ కమిటీ చైర్మన్ బి.చినబాబు, రేఖాన వాసు, రాజమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు ప్రోత్సాహకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

నరసన్నపేట: గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.50 వేలు అదనపు ప్రోత్సాహకం అందిస్తుందని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ మధుసూదనరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. గతేడాది డిసెంబర్ 10వ తేదీ తరువాత నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందన్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బేస్‌మెంట్ పూర్తి చేస్తే రూ.15 వేలు, రూఫ్ స్థాయికి రూ.15 వేలు, స్లాబ్‌కు రూ.10 వేలు, ఇళ్లు పూర్తి చేస్తే రూ.10 వేలు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

పరామర్శ..



ఆదినారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కె.వి.జి.సత్యనారాయణ

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) సర్పంచ్ జల్లు సిమ్మమ్మ ఇటీవలి అనారోగ్యంతో మృతి చెందారు. సిమ్మమ్మ సోదరుడు, మాజీ సర్పంచ్ జల్లు ఆదినారాయణ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు ఉన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



జయలక్ష్మికి నగదు అందజేస్తున్న మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

జలుమూరు: చల్లవానిపేటకు చెందిన గుజ్జల జయలక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆమెకు మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం రూ.10 వేలు అందించారు. ప్రతినెలా ఒకరు చొప్పున రూ.10 వేలు అందించేందుకు తీర్మానించినట్లు ఫౌండేషన్ ప్రతినిధి మెండ రామారావు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి



కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘం నేతలు

కొత్తూరు: మండల కేంద్రంలో కాన్షీరామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి బీఎస్పీ పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.కృష్ణారావు, దళిత సంఘ నాయకులు నివాళులర్పించారు.


వినియోగదారుల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి

ఆమదాలవలస: వస్తువులు కొనుగోలు చేసినప్పుడు ప్రశ్నించే హక్కు ప్రతీ వినియోగదారునికి ఉందని ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఎస్.ఎన్.స్వామి అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలు, ఫోరమ్‌ల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ వి.ఉషాపద్మిని, అధ్యాపకులు రాజశేఖర్, అష్టలక్ష్మి, ప్రసాదరావు, కె.జగన్నాథరావు, కె.బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



నరసన్నపేట: పరీక్షలు పూర్తికావడంతో ఆనందంగా ఉన్న విద్యార్థులు

నరసన్నపేట/సారవకోట: ఇంటర్‌మీడియట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి ఆనందంగా బయటకువచ్చారు. ఒకరికొకరు వీడ్కోలు పలుకుతూ కనిపించారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. తామరాపల్లి రెసిడెన్షియల్ కళాశాలతో పాటు జయలక్ష్మీనగర్‌లోని బీసీ వసతి గృహాల నుంచి విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. సారవకోట జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు ఎలా రాశారో చర్చించుకున్నారు.

సారా తయారీకి దూరంగా ఉండాలి



సారా మహమ్మారి వలన ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయని, సారా క్రయవిక్రయాలు మానుకోవాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు అన్నారు. మెళియాపుట్టి మండలం నేలబొంతులో గిరిజనులకు శనివారం అవగాహన కల్పించారు. గిరిజన గ్రామాలను సారా రహితంగా తయారు చేయడమే లక్ష్యంగా నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు సారా తయారీ చేస్తే పోడు పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, ఎస్ఐ రమేష్ బాబు పాల్గొన్నారు.

– మెళియాపుట్టి

నాణ్యతాలోపం



ఈ చిత్రం కొత్తూరు మండలంలోని వసప సమీపంలో గోతులు ఏర్పడిన పాలకొండ–హడ్డుబంగి రోడ్డు. ఈ రోడ్డును కొద్ది నెలల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయించారు. పనులు నాసిరకంగా చేయడంతో మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– కొత్తూరు

సాగునీరు అందేది ఎప్పుడో?



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం జంబాడ సమీపంలోని కడగండి రిజర్వాయర్ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి కాలువ మయోడెక్ట్. జంబాడ సమీపంలో 600 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 2007లో కడగండి జలాశయం నిర్మించారు. రిజర్వాయర్ నుంచి పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు కుడి, ఎడమ కాలువల నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. వర్షా కాలంలో కొండల్లో కురిసిన వరద నీరు జలాశయంలోకి చేరుతుంది. అప్పటినుంచి మదుములు ద్వారా నీరు వృథాగా పోతుంది. కాలువల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, పాలకులను రైతులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

పరీక్ష మెటీరియల్ పంపిణీ



నరసన్నపేట: పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న భీమారావు

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం కోదడ్డపనస గ్రామానికి చెందిన పొన్నాన సింహాచలం పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. సోమవారం నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల నిమిత్తం అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర సామగ్రిని 55 మంది విద్యార్థులకు హెచ్ఎం రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.



సారవకోట: పరీక్ష మెటీరియల్‌తో విద్యార్థులు

బొరిగివలసలో..


నరసన్నపేట: మండలంలోని బొరిగివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 56 మంది టెన్త్ విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, అట్టలు, పెన్సిళ్లు, తదితర సామగ్రిని పూర్వ విద్యార్థి సూరపు భీమారావు శనివారం పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.300 విలువ చేసే సామగ్రి అందించారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించారు. హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

సారవకోట: మండలంలోని సారవకోట, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని టెన్త్ పరీక్ష కేంద్రాలను ఎంఈఓ ఎం.వి.రమణ సోమవారం పరిశీలించారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న పరీక్షలకు 477 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. సారవకోట పరీక్ష కేంద్రంలో సారవకోట, అలుదు, చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, తర్లి, సవరబొంతు ఆశ్రమ పాఠశాలలు, ఒక ప్రైవేట్ పాఠశాల నుంచి 301 విద్యార్థులు, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 176 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

ఆరు పరీక్ష కేంద్రాల ఏర్పాటు..

పాతపట్నం: మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నట్లు ఎంఈఓ ఎ.గోవిందరావు తెలిపారు. శనివారం పాతపట్నం మోడల్ స్కూల్, కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. కొరసవాడ, తెంబూరు, సీది, పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఒక్కొక్కటి, అంబేడ్కర్ ఏపీ గురుకుల పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1,117 మంది విద్యార్థులు పదో తగరతి పరీక్షలు రాయనున్నారన్నారు. హెచ్‌ఎంలు కె.వి.రత్నకుమారి, బి.సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సారవకోట: సారవకోటలో బెంచీలను పరిశీలిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏఓ కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌కు కావాల్సి విత్తనాలతోపాటు ప్రస్తుతం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాల వివరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. పశువుల్లో వ్యాపించే గాలికుంటు వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలపై పశువైద్యాధికారి ఎం.దీప్తి వివరించారు. రెవెన్యూ, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల పనితీరును తహసీల్దార్ జెన్ని రామారావు, వైద్యాధికారులు పూజారి సుజాత, ప్రసన్నలత, పొన్నాడ గురునాథరావు, మండల జేఈ శ్రీధర్ వివరించారు. కొమనాపల్లి–కేలవలస మీదుగా అలుదుకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొమనాపల్లి సర్పంచ్ కె.సీతారాం కోరారు. ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

పొందూరు రూరల్: అయోడిన్ లోపంతో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని మండల ఓఆర్‌డబ్ల్యూ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని తుంగపేటలో ఉపాధి హామీ వేతనదారులకు అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. అయోడిన్ లోపిస్తే గర్భిణులు, బాలింతలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయో వివరించారు.

ఆ పాఠశాలకు మాత్రమే ప్రత్యేకమా?

ఆమదాలవలస: టెన్త్ పరీక్ష కేంద్రాల కేటాయింపులో ఆమదాలవలసలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి అనుకూలంగా జిల్లా విద్యాశాఖాధికారులు వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమదాలవలస పట్టణంలో 9 ప్రైవేట్ పాఠశాలల నుంచి 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 8 పాఠశాలల విద్యార్థులను వేర్వేరు కేంద్రాలు కేటాయించారు. ఆ ఒక్క పాఠశాల విద్యార్థులు 46 మందిని పట్టణంలోని గేటు మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కేటాయించడంపై చర్చనీయాంశమైంది. గతేడాది కూడా ఈ పాఠశాల విద్యార్థులందరికీ ఒకే పరీక్ష కేంద్రం కేటాయించారు. ఈ విషయమై జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ అలీఖాన్ వద్ద ప్రస్తావించగా.. పరీక్ష కేంద్రాల కేటాయింపు ప్రక్రియ అమరావతిలోనే జరుగుతుందన్నారు. ఇందులో జిల్లా విద్యాశాఖాధికారుల ప్రమేయం ఉండదన్నారు.